బ్లాక్ 'స్పాట్స్'లో మార్పులు

ఎన్‌హెచ్-44లో ప్రమాద ప్రాంతాల్లో బ్రిడ్జిలు
ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జాతీయ రహదారి-44లోనున్న బ్లాక్ స్పాట్స్‌లో కొన్ని మార్పులు తీసుకొచ్చేందుకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఎఐ) సంస్థ చర్యలు చేపట్టింది. రోడ్డు ప్రమాదాల్లో అత్యధికం జాతీయ రహదారులపైనే జరుగుతున్నాయి. ఇందులో కొన్ని చోట్ల కూడళ్లలో ఇవి ఎక్కువగా జరుగుతున్నట్టు గుర్తించారు. రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లోనూ పదేపదే ఈ అంశాలే చర్చకొస్తున్న నేపథ్యంలో అనంతపురం మీదుగా పోతున్న జాతీయ రహదారి 44లోని బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించారు. అనంతపురం పరిధి వరకు చూస్తే అటు కర్నూలు జిల్లా నుంచి సత్యసాయి జిల్లా సరిహద్దు బాగేపల్లి వరకు జాతీయ రహదారి 44 విస్తరించి ఉంది. ఈ మొత్తంలో 22 ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించినట్టు సమాచారం.

22 ప్రాంతాల్లో మార్పులు

అనంతపురం నుంచి బాగేపల్లి వరకు మొత్తం 22 ప్రాంతాల్లోని కూడళ్లలో మార్పులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో కర్నూలు జిల్లా పరిధిలో ఐదు ప్రాంతాల్లోకాగా, ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 17 ప్రాంతాల్లో మార్పులు చేయనుంది. ఇందులో నాలుగు ప్రాంతాల్లో కొత్తగా ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టాలని ప్రతిపాదించినట్టు సమచారం. తక్కిన 18 అండర్ పాసుల నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అనంతపురం జిల్లా వరకు చూస్తే 18 ప్రాంతాల్లో మార్పులు చేయనున్నారు. ఇందులో అనంతపురం నగర శివారులోని తపోవనం, రాప్తాడు వద్ద ఫ్లైఓవర్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇక పామిడి హంపాపురం, గార్లదిన్నె, లోలూరు క్రాస్, వడియం పేట, మామిళ్లపల్లి క్రాస్, పెనుకొండ, పాలసముద్రం, మిషన్ తండా ఇలా మొత్తం 22 చోట్ల గుర్తించిన బ్లాక్ స్పాట్‌లో నేరుగా జాతీయ రహదారిపై వాహనాలు రాకుండా అండర్ పాసులతోపాటు సర్వీసు రోడ్డులను ఏర్పాటు చేసేందుకు జాతీయ రహదారుల సంస్థ సిద్ధమైనట్టు సమాచారం.

అక్రమణల తొలగింపునకు చర్యలు

జాతీయ రహదారుల సంస్థకు సంబంధించిన స్థలాలు ఆక్రమణలకు గురైన వాటిని గుర్తించి తొలగించేందుకు జాతీయ రహదారుల సంస్థ, రెవెన్యూ అధికారులు సర్వేలు నిర్వహించి తొలగిస్తున్నారు. అనంతపురం పరిధిలో ఇప్పటికే తపోవనం ప్రాంతాల్లో తొలగింపు జరుగుతుండగా, అనంతపురం నగర పరిసరాల్లోనూ అనంతపురం నుంచి రాప్తాడు వరకు సర్వే నిర్వహించారు. ఈ సర్వేల్లో అనేక చోట్ల పెద్దఎత్తున జాతీయ రహదారి స్థలాన్ని ఆక్రమించినట్టుగా గుర్తించారు. ప్రధానంగా రాప్తాడు పరిధిలో వచ్చే అనేక ప్రముఖ హోటళ్లే ముందుకొచ్చి పెద్దఎత్తున నిర్మాణాలు కూడా చేపట్టి ఉండటం గమనార్హం. తాజ్ బంజారు హోటల్, హైదారబాదు చెఫ్, పాకశాల హోటళ్లు ముందుకొచ్చాయి. వీటితోపాటు అనేక రెస్టారెంట్ల పరిస్థితి ఇదే రకంగా ఉంది. వాటికి మార్కింగ్ కూడా ఇచ్చారు. త్వరలోనే తొలగిస్తామని నోటీసులిచ్చారు. అయితే యజమానులు తమకున్న పలుకుబడితో దీనిని మార్చేందుకు చూస్తున్నట్లు సమాచారం. ఈ పేరుతో పనులు ప్రారంభం కాకుండా మరికొంత కాలం కాలం వెల్లదీసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

బాబోయ్..కుక్క..!

- జనంపై గ్రామసింహాల దాడి
- ప్రభుత్వాసుపత్రికి బాధితుల పరుగు
- ద్విచక్రవాహనాల వెంటబడుతున్న కుక్కలు
- భయపడి కిందపడుతున్న వాహనదారులు

ఈ ఫొటోలో కన్పిస్తున్న బాలుని పేరు తారక్. అనంతపురం రూరల్ సోములదొడ్డిలో ఉంటాడు. రెండు రోజుల క్రితం బాలుడు ఇంటి వద్ద ఆందుకుంటూ ఉండగా కుక్క కరిచింది. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు.

అనంతపురం సర్వజన ఆసుపత్రిలో రేబిస్ టీకా కోసం వేచి ఉన్న కుక్క కాటు బాధితులు

సోమలదొడ్డిలో కుక్కకాటుకు గురై వ్యాక్సిన్ కోసం కుమారున్ని అనంతపురం సర్వజనాసుపత్రికి తీసుకొచ్చిన తండ్రి

"రెండు రోజుల క్రితం అనంతపురం నగరం హౌసింగ్ బోర్డులో రేషన్ సరుకులు తీసుకునేందుకు ఓ వ్యక్తి స్టోరు వద్దకెళ్లాడు. అతను రేషన్ షాపులోకి వెళ్తుండగా ఓ కుక్క వేనకన వచ్చి కాలికి బలంగా కరిచింది. రేషన్ షాపు వద్ద ఈ ఘటన జరగడంతో ఒక్కసారిగా అక్కడున్న వారు భయాందోళనకు గురయ్యారు. మహిళలు, చిన్నపిల్లలు ఎక్కువగా వస్తున్న ఇలాంటి ప్రాంతాల్లోనూ కుక్కలు దాడులు చేయడం ఆందోళన కలిగిస్తోంది".

"అనంతపురం నగరం విద్యుత్ సర్కిల్ నుంచి ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా కుక్కలు వెంటబడ్డాయి. భయాందోళనకు గురైన ఆ వ్యక్తి వేగంగా వాహనాన్ని నడిపాడు. దీంతో అదుపు తప్పి రోడ్డుపై కింద పడి గాయపడ్డాడు".

"శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణం నిజాం వలి కాలనీలో ఇంటి వద్ద ఆడుకుంటున్న ఓ బాలున్ని వీధికుక్కలు తీవ్రంగా కరిచాయి. తీవ్రంగా గాయపడిన బాలున్ని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బాలుడు కదిరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు".

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్, కదిరి టౌన్

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కుక్కలు ఎలా జనంపై దాడి చేస్తున్నాయన్న దానికి కొన్ని ఉదాహరణలు మాత్రమే ఇవి. పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా దాదాపు అన్ని ప్రాంతాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పలువురిపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. కుక్కలను పట్టుకుని పట్టణానికి దూరంగా తరలిస్తామంటూ అధికారులు, ప్రజాప్రతినిధుల మాటలు నామమాత్రమే అన్నట్లు కన్పిస్తోంది. కుక్కకాటుతో ప్రతి రోజూ అనంతపురం సర్వజన ఆసుపత్రిలో 50 నుంచి 80 మంది చికిత్స నిమిత్తం వెళుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులకు పెద్ద సంఖ్యలో కుక్కకాటు బాధితులు వెళ్తున్నారు. శనివారం నాడు ఉదయం 11 గంటల్లోపుగానే అనంతపురం సర్వజన ఆసుపత్రిలో కుక్కకాటుకు గురైన 55 మంది వ్యాక్సిన్ వేయించుకున్నారు. సాయంత్రానికి ఈ సంఖ్య మరింత పెరిగింది. ఒక్కోరోజు వందకు పైగా కుక్కకాటుకు గురైన వారు వ్యాక్సిన్ వేయించుకుని వెళ్తుంటారని వైద్యులు చెబుతున్నారు.

రోడ్లపై కుక్కల గుంపు.. వాహనదారులపై దాడి

నగరంలో రోడ్లపై కుక్కల గుంపులు కన్పిస్తాయి. రోడ్డుపై ఉన్న కుక్కల గుంపును చూసి ఆ వీధుల్లోకి వెళ్లేందుకు జనం భయపడుతున్నారు. వీధుల్లో కుక్కల నియంత్రణకు సంబంధిత మున్సిపల్,కార్పొరేషన్ అధికారులు సంతన నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నామని చెబుతున్నా వాటి సంఖ్య మాత్రం తగ్గుతున్న దాఖలాలు లేవు. కుక్కల దాడిలో అత్యంత ప్రమాదకరంగా వాహనదారులపై చేసే దాడులు కన్పిస్తున్నాయి. వేగంగా వెళుతున్న ద్విచక్రవాహనాల వెంట కుక్కల గుంపు వెంటపడుతోంది. వాహనం వెళ్లే వేగానికి సమానంగా కుక్కలు పరిగెడుతున్నాయి. దీంతో వాహదారుడు తీవ్ర భయాందోళనకు గురై వేగంగా వెళ్లి కిందపడడం లేదా కుక్కకాటుకు గురవడం లాంటి ఘటనలు అధికంగా జరుగుతున్నాయి. భార్యాభర్తలు వెళ్తున్న సమయంలో అయితే వెనుక కూర్చొన్న మహిళల చీరలు లాగి కిందపేడేలా చేస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులపైన కూడా వీటి దాడులు అధికంగా ఉంటున్నాయి.

కదిరిలో కుక్కకాటుకు గురైన బాలుడు

కుక్కలను నియంత్రించాలి

కుక్కలు రోడ్లపై అధికంగా ఉంటున్నాయి. ద్విచక్రవాహనంపై వెళ్తుంటే వెంటబడుతున్నాయి. వాటిని తప్పించుకునేందుకు భయంతో వాహనాన్ని వేగంగా నడిపితే కింద పడిన సందర్భాలూ ఉన్నాయి. వారం రోజులుగా క్రితం సాయంత్రం వేళ ఇంటికి వెళుతున్న సమయంలో ఓ కుక్క వెంటబడివంది. దీంతో తీవ్ర భయాందోళనకు గురయ్యాను. కార్పొరేషన్ అధికారులు వీటిపై స్పందించాలి.

డి.అశ్వర్థనారాయణ, నవోదయ కాలనీ,అనంతపురం.

కుక్కలను నియంత్రించండి : సిపిఎం

కదిరి టౌన్ : కదిరి పట్టణం నిజాంవళి కాలనీలో కుక్కల దాడిలో యాసిన్ అనే చిన్నారి శనివారం నాడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం బాలుడు కదిరి పట్టణంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సిపిఎం నాయకులు జిఎల్.నరసింహులు, బాబ్‌జాన్, ముస్తాక్ అలీ, రామ్మోహన్, ఆంజనేయులు ఆసుపత్రికి వెళ్లి బాలుని ఆరోగ్య పరిస్థితి గురించి తల్లిదండ్రులతో అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కదిరి పట్టణంలో కుక్కల దాడులు అధికమయ్యాయని, ముఖ్యంగా పిల్లలను విచక్షణా రహితంగా కరుస్తున్నాయన్నారు. ఇంతమంది కుక్కల బారిన పడుతున్నా మున్సిపల్ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. అధికారులకు పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజలసమస్యలపై లేకపోవడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి జిల్లా వ్యాప్తంగా కుక్కల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కదిరిలో కుక్కకాటుకు గురైన బాలుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

వైసిపి పాలనలో భ్రష్టు పట్టిన 'అనంత'

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గత ఐదేళ్లలో ఎక్కడా అభివృద్ధి పనులు చేయకుండా వైసిపి నాయకులు నగరాన్ని భ్రష్టు పట్టించారని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శించారు. శనివారం నగరంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా రామ్‌నగర్ పార్కు వద్ద రూ.82లక్షలతో సిసి రోడ్డు, శ్రీకంఠం సర్కిల్ వద్ద రూ.40లక్షలతో సిసి డ్రెయిన్‌కు భూమిపూజ చేశారు. తర్వాత ఉమానగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. హౌసింగ్ బోర్డులోని ఎస్‌బిఐ కాలనీలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో నగరాన్ని నాశనం చేశారన్నారు. ఎక్కడ చూసినా రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు కనిపిస్తున్నాయన్నారు. ఒకటిన్నర ఏడాదిలోని రూ.కోట్లతో అన్ని డివిజన్లోనూ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రుద్రంపేట రోడ్డు, రాంనగర్ 80 ఫీట్ రోడ్లను పూర్తి చేశామన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

డిజిటల్ లైబ్రరీకి పూర్వవైభవం తెస్తాం

ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వడ్డే వెంకట్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రంథాలయాల అభివృద్ధిలో భాగంగా డిజిటల్ లైబ్రరీకి పూర్వ వైభవం తెస్తామని ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వడ్డే వెంకట్ తెలిపారు. ఛైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ప్రజాశక్తితో ఆయన పలు విషయాలు వెల్లడించారు. గ్రామీణ స్థాయి నుంచి పాఠకులకు గ్రంథాలయాలను మరింత అందుబాటులోకి తెస్తామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా తనను నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను అంకితభావం, చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానన్నారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేకు బొకే అందజేస్తున్న వడ్డే వెంకట్

ఎమ్మెల్యే దగ్గుపాటిని కలిసిన వెంకట్

నూతనంగా నియమితులైన ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వడ్డే వెంకట్ శనివారం అర్బన్ టిడిపి కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బొకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, సిబ్బంది జయరాం, రవికుమార్, సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోనంకి గంగారం, టిడిపి నాయకులు హరి, వడ్డే చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను తొలగిస్తే సహించం

- పద్మావతి ఏజెన్సీ చర్యలు దుర్మార్గం
- పద్ధతి మార్చుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం
- ఆందోళనలో సిపిఎం, సిఐటియు, కార్మిక సంఘాల నాయకులు

ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులతో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మినారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులను అకారణంగా పద్మావతి ఏజెన్సీ నిర్వాహకులు తొలగించాలని చూస్తున్నారని, ఈ చర్యలను సహించేది లేదంటూ సిపిఎం, సిఐటియు, కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికుల అక్రమ తొలగింపులను నిరసిస్తూ శనివారం ఉదయం ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. సిపిఎం, సిఐటియు, వైఎస్ఆర్‌టియు, ఐఎఫ్‌టియు, ప్రజా సంఘాల నాయకులు కార్మికులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. పద్మావతి ఏజెన్సీ నిర్వాహకులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన వద్దకు వచ్చిన పద్మావతి ఏజెన్సీ నిర్వాహకులను నిలదీశారు. ఈ సమయంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు కలుగుజేసుకుని ఏజెన్సీ ప్రతినిధులు సాయి, హరిలను అక్కడి నుంచి వెనక్కు పంపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న వారిని ఏజెన్సీ అకారణంగా తొలగించాలని చూస్తోందన్నారు. ఈ ఉద్యోగాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్మికులు ఉద్యోగం పోతే రోడ్డున పడతారన్నారు. పద్మావతి హౌస్‌కీపింగ్ ఏజెన్సీ చర్యలు అత్యంత దుర్మార్గంగా ఉన్నాయన్నారు. పారిశుధ్య కార్మికుల్లో 50 ఏళ్లు పైబడిన వారిని, డిగ్రీ అర్హత లేకపోతే సూపర్‌వైజర్లను తొలగిస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఈ అక్రమ తొలగింపులపై జిల్లా అధికారులు, కార్మిక శాఖకు తెలిపినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగం పోతున్న మనస్తాపంతో శుక్రవారం నాడు ఓ కార్మికురాలు గుండెపోటుకు గురైందన్నారు. కార్మికులను యధావిధిగా విధుల్లో కొనసాగించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాగా ఆసుపత్రిలో నిర్వహించిన ఓ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీ అంబికా లక్ష్మినారాయణ కార్మికుల వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఎవరికీ నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, జిల్లా కోశాధికారి ఎం.నాగమణి, నగర కార్యదర్శి ఎస్.ముర్తుజ, ఆఫీస్ బేరర్స్ ఏటీఎం నాగరాజు, జిల్లా నాయకులు ఎన్టీఆర్ శీన, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఛైర్మన్ సాకే హరి, కార్మికులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-గుమ్మగట్ట

మండల పరిధిలోని తాళ్లకెర గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విప్ కాలవ శ్రీనివాసులు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రానికి అతి సమీపంగా ఉండే మేజర్ పంచాయతీ తాళ్లకెరలో ప్రజల సౌకర్యార్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాళ్లకెర, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆసుపత్రికి వెళ్లాలంటే అటు గుమ్మఘట్ట, ఇటు రాయదుర్గం కానీ వెళ్లాల్సిన పరిస్థితి అన్నారు. రాత్రి వేళల్లో మరీ ఇబ్బందిగా ఉండేదన్నారు. దీంతో ప్రజల సౌకర్యార్థం దాదాపు రూ.1.94 కోట్లతో భవన నిర్మాణానికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ శ్రీనివాసరెడ్డి, కళ్యాణదుర్గం ఇఇ ప్రసాద్‌రెడ్డి, గుమ్మఘట్ట పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, తాళ్లకెర డాక్టర్ సందేశ్‌రామ్ కిషోర్, డాక్టర్ అజర్ కన్, డాక్టర్ యశ్వంత్‌కుమార్, ఆర్‌అండ్‌బి డిఇ రవిశంకర్‌రెడ్డి, జూనియర్ ఇంజినీర్ నాగేంద్రప్రసాద్, టిడిపి నాయకులు మండల కన్వీనర్ కాలవ సన్నన్న, గిరిమల్లప్ప, హనుమంతురెడ్డి, రాము, శ్రీరాములు, వెంకటేష్, బేలోడు సంజీవ, వీరాపురం సర్పంచు నాగరాజు, కలుగోడు రాజు, చిన్నికిష్టప్ప, ఆరోగ్య సిబ్బంది లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్, శాంతికుమారి, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

త్వరలో ఎంజెపి పాఠశాల ప్రారంభం

మండల పరిధిలోని ఎంజెపి పాఠశాలను త్వరలో ప్రారంభించనున్నట్లు విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో విప్ కాలవ ముఖాముఖి నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం భవన నిర్మాణాలకు ప్రిన్సిపాల్ హబ్సిబా వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కాలవ సన్నన్న, గిరి మల్లప్ప, సర్పంచు విజయలక్ష్మి, సదాశివ, చిన్ని కిష్టప్ప, ఎంఇఒ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడబడితే అక్కడ వ్యర్థాలను వదలొద్దు

తాడిపత్రి : పట్టణ పరిధిలోని నల్లబండల ఫ్యాక్టరీ యజమానులు, పాత ఇళ్లు కూలుస్తున్న ఇంటి యజమానులు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఫ్యాక్టరీలు, ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు, రాళ్లు, మట్టి, దుమ్మును తాడిపత్రిలో ఎక్కడంటే అక్కడ వదలకుండా కేవలం బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న కళ్యాణ మండపం పక్కన వదలాలని సూచించారు.

వాహనాల తనిఖీ

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి మండలంలో శనివారం వాహన తనిఖీలు నిర్వహించిన రూరల్ సి ఐ శివగంగదర రెడ్డి, నిబంధనలు పాటించని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహన సంబంధిత ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఆయన సూచించారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేద్దాం

సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్‌వి.నాయుడు

ప్రజాశక్తి-అనంతపురం

డిసెంబర్ 31వతేదీ నుంచి విశాఖలో నిర్వహించనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేద్దామని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్‌వి నాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఉరవకొండ మండల కేంద్రంలో సిఐటియు, హమాలీ యూనియన్, కౌలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై దాడి చేసే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారంపై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, హమాలీ యూనియన్ నాయకులు టి.గోపాల్, బి.గోవిందు, ఎం.గోవిందు, జె.ఓబులేసు, ఎం.నాగేంద్ర, టి.సంజప్ప, కౌలు రైతుసంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశులు, సుంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మురళి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న కౌలు రైతుసంఘం నాయకులు

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం

కౌలు రైతులను అన్నివిధాలుగా ప్రభుత్వమే ఆదుకోవాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేషులు డిమాండ్ చేశారు. శనివారం ఉరవకొండ మండల పరిధిలోని లత్తవరం గ్రామంలో కౌలు రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డులు ఉన్న వారందరికీ బ్యాంకు రుణాలు కచ్చితంగా ఇచ్చి ఆదుకోవాలన్నారు. పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ రూ.20వేలు ఇచ్చి ఆదుకోవాలని, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, ఎరువుల మందులు, విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కౌలు రైతుసంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా జి.శివ, కార్యదర్శి ఎం.ధనుంజయ, సహాయ కార్యదర్శిగా సి.శ్రీనివాసులు, కోశాధికారి వై.విజయ్‌కుమార్, కౌలు రైతుసంఘం సభ్యులుగా సురేష్, రామాంజనేయులు, లక్ష్మీదేవి, రేవతి, అరుణమ్మ, లాలుస్వామి, సుంకన్న, గోవిందనాయక్, రామాంజనేయులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం మండల నాయకులు సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

పుట్లూరు : శింగనమల నియోజకవర్గానికి సంబంధించి పలువురికి మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను శనివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అందజేశారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు సింగల్‌విండో అధ్యక్షుడు గోవర్ధనరాజు, ఓబుళాపురం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిపై శ్రద్ధేదీ.?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా అంటేనే అత్యల్ప వర్షపాతం కలిగిన ప్రాంతం. దేశంలో జైసల్మీర్ తరువాత అతి తక్కువ వర్షపాతం కలిగిన ఈ ప్రాంతానికి సాగునీటి వనరులున్నది కూడా చాలా తక్కువనే చెప్పాలి. నికర జలాలున్నది తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ మాత్రమే. ఇక 2012 నుంచి హంద్రీనీవా ద్వారా నీరు వస్తున్నాయి. ఇప్పుడు రెండే ప్రధాన ఆధారంగానున్నాయి. వీటి ద్వారానే సాగు, తాగునీరు ప్రజలకు అందుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 27 లక్షల ఎకరాల వరకు సాగుభూమి ఉంది. కాని ఇందులో సాగునీటి వసతి ఉన్నది రెండు లక్షల ఎకరాల్లోపే ఉంది. హంద్రీనీవా ద్వారా నీరిస్తున్నా ఇంకా పంట కాలువల నిర్మాణాలు ఎక్కడా పూర్తవలేదు. మొదటి దశలో 80 వేల ఎకరాల ఆయకట్టు నీరు ఇవ్వాల్సి ఉన్నా లక్ష్యమున్నప్పటికీ పంటకాలువల నిర్మాణాలు ఇప్పటికీ ఆరంభమే అవలేదు. ఎంతున్నా వచ్చిన నీటిని చెరువులకు మళ్లించి వీటి ద్వారా పంటలకు నీరు ఇస్తున్నారు. దీని నిర్దిష్టమైన ఆయకట్టు ఏదీ లేదు. ఆయకట్టుకు నీరందించేందుకు వీలున్నది తుంగభద్ర ఎగువ కాలువ కిందనే. దీని కిందనున్న కాలువల పరిస్థితి అధ్వాన్నంగా మారుతున్నాయి. కొన్ని దశాబ్దాలుగా ఆధునీకరణకుగానూ, మరమ్మతులకుగాని నిధుల కేటాయింపులు నామమాత్రంగా జరుగుతూ ఉన్నాయి. దీంతో గట్లు బలహీనపడి ఎప్పుడు ఎక్కడ గండ్లు పడతాయో తెలియని పరిస్థితులున్నాయి. ఈ వారంలో రెండు కాలువలకు గండ్లు పడ్డాయి. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ఒకచోట పడగా, పిఎబిఆర్ కుడికాలువకు ఒకచోట పడ్డాయి. దీంతో రెండు చోట్ల కాలువ కిందనున్న పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఇక అంతక మునుపు వారంలో కాలువలకు నీరు విడుదల చేయడానికి గేట్లు ఎత్తేందుకు పోతే అవి పైకి లేవక అధికారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఇవన్నీ కూడా సాగునీటికి పాలకులు ఏ మేరకు శ్రద్ధ చూపుతున్నారన్న చర్చకు దారితీస్తున్నాయి.

ఈ వారంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతు ఆత్మహత్యలు కొనసాగాయి. కూడేరులో ఒక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకు మునుపు పుట్లూరులో అరటి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. తాడిమర్రి మండలంలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా వరుసగా రైతు ఆత్మహత్యలు జరుగుతున్నాయి. తాజాగా ఈ వారంలో ఉరవకొండ ప్రాంతంలో అత్యధికంగా మిరప పంటకు అగ్గి తెగులు సోకి వందల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. వీటి నివారణ ఏ చర్యలు తీసుకోవాలన్న దానిపై శాస్త్రవేత్తలు ఆ ప్రాంతంలో పర్యటించారు. ఇలా రైతుకు అన్ని విధాలుగా కష్టాలే ఎదురవుతున్నాయి. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు మరోవైపు గిట్టుబాటు ధరల్లేక పంట పండినా రైతుకు నష్టాలే మిగిలే పరిస్థితులు నెలకొన్నాయి. రైతుకు అధిక ప్రాధాన్యతనిస్తామని ప్రభుత్వాలు ప్రకటనలు చేయడం మినహా రైతుకు మద్దతు ధరకు పంటలు కొనే పరిస్థితి లేదు. కనీసం సాగునీటిని సక్రమంగా అందివ్వలేకపోతున్నారు. పంట కాలువల మరమ్మతులు, ఆధునీకరణకు దశాబ్దాలుగా చేపట్టడం లేదు. దీంతో రైతుల కష్టాలు తొలగడం లేదు. వచ్చే ఏడాది బడ్జెట్‌లోనైనా పాత ఆయకట్టు స్థిరీకరణకు కోసం నిధులు కేటాయించి పరిష్కారానికి కృషి చేస్తారా లేదా అన్న చర్చ నడుస్తోంది. వచ్చే ఏడాది కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే ఆయకట్టు రైతులకు రాబోయే రోజుల్లో మరిన్ని కష్టాలు తప్పేలా కనిపించడం లేదు. హంద్రీనీవాతోపాటు, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అనంత మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌కు అభినందనలు

ప్రజాశక్తి-అనంతపురం

బల్లా పల్లవి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా నియమితులైన బల్లా పల్లవికి పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపి మాంసం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ చంద్రదండు ప్రకాష్‌నాయుడు, లక్ష్మీనాయుడమ్మ, పరిమి చరణ్, చంద్రశేఖర్‌నాయుడు మర్యాద పూర్వకంగా కలిసి బల్లా సురేష్, బల్లా పల్లవి దంపతులను సన్మానించారు.

నేడు నగరంలో నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్ : నగరానికి తాగునీటిని సరఫరా చేసే పిఎబిఆర్ పైప్‌లైన్‌కు రాచానపల్లి గ్రామం వద్ద లీకేజీ ఏర్పడినందున మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఆదివారం సాయంకాలం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ బాలస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని నగర ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

అయ్యప్ప మాలధారులకు దుప్పట్లు పంపిణీ

అనంతపురం : నిత్యసరభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం చైర్‌పర్సన్ ఎస్.నిర్మలమూర్తి ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప మాలధారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇందుకు ట్రస్టు సభ్యులు శ్రీలక్ష్మి, శ్రీనివాస్ దంపతుల కుమార్తె హారిక పుట్టినరోజును పురస్కరించుకుని తడకలేరు వద్ద అశ్వర్థనారాయణస్వామి ఆలయంలో శివస్వాములు, అయ్యప్ప స్వాములకు దుప్పట్లు, టవల్స్, వాటర్ బాటిళ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మల్లికార్జున, శివరాజు ప్రసాదు, శశికళ, మాజీ సర్పంచి వెంకటలక్ష్మి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేత

ప్రజాశక్తి-పామిడి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు పామిడి, గుత్తి టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ముందుగా టిడిపి సీనియర్ నాయకులు బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, కత్రిమల ప్రభాకర్‌చౌదరి, జింకల సంజీవకుమార్, లంగాల గౌస్, తదితరులు స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో కేక్ కోశారు. తర్వాత వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ బొమ్మా మోహన్, గుత్తి మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ కొట్టం మాలిక్, పసల శ్రీరాములు, మాజీ కౌన్సిలర్ తేల్‌బాషా, వెల్డింగ్ బాబా, హుస్సేన్ పీరా, సంజీవ, వైస్ ఎంపిపి కాయల మహేష్, నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు శివ అభిరామ్, వడ్డే హయగ్రీవ, బోయ నరసింహ, బాబు, హుస్సేన్, జనసేన రాము, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-సెట్టూరు

ప్రతిభ కనబరిచి విద్యకు దూరమై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థికి ఇన్ఫినిటీ ఛారిటబుట్ ట్రస్టు బద్దేనాయక్ శనివారం రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. కళ్యాణదుర్గం మండలంలోని ఓ గ్రామానికి చెందిన సిద్ధార్థ్ అనే విద్యార్థి కళాశాల ఫీజు కట్టలేక నెల రోజుల నుంచి ఇంటి వద్దనే ఉంటున్నాడు. స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న బద్దేనాయక్ నేరుగా కళాశాలకు చేరుకుని రూ.20వేల ఫీజు చెల్లించి రసీదు తీసుకున్నారు.

వేగవంతంగా రీసర్వే

ప్రజాశక్తి-కూడేరు

మండలంలోని మూడు గ్రామాల్లో రీసర్వే పనులను వేగవంతం చేసినట్లు రీసర్వే డిటి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తిమ్మాపురం, చోళసముద్రం, ఎంఎం.హళ్లి గ్రామాల్లో రీ సర్వే పూర్తి కాగా కొర్రకోడు, జయపురం గ్రామాల్లో కొనసాగుతోందన్నారు. వీలైనంత త్వరగా రీసర్వేను పూర్తి చేస్తామన్నారు.

శక్తియాప్‌పై అవగాహన

యల్లనూరు : ఎస్పీ ఉత్తర్వుల మేరకు మండల పరిధిలోని కొడవండ్లపల్లి, యల్లనూరు గ్రామాల్లో సిఐ సత్యబాబు, ఎస్ఐ రామాంజనేయరెడ్డి, పిఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా డయల్ 100, 112, రవాణా సమయంలో రాత్రి పూట బసు తప్పిపోయిన సమయంలో శక్తి యాప్ ద్వారా ఎలా మెసేజ్ చేయాలన్న వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐలు జమేదార్‌లు, పోలీసులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దాసుపత్రిలో వసతుల కల్పనకు కృషి

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం

మాట్లాడుతున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

నగరంలోని పెద్దాసుపత్రిలో వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మీనాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాటరింగ్ వెంకట రమణ 20 స్ట్రెచర్స్‌ను ఎంపితో ప్రభుత్వ ఆసుపత్రికి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఇప్పటికే రాయలసీమలో అనంతపురం ఆసుపత్రిలో మదర్ మిల్క్ సెంటర్ ఏర్పాటు చేశారని, ప్రజల నుంచి మంచి ఆదరణ పెరుగుతోందన్నారు. పేషెంట్ బంధువుల కోసం విశ్రాంతి గదులు కడుతున్నామని, త్వరలో సెంట్రల్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రత్నమయ్య, నరసింహులు, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, ఆర్ఎంఒ హేమలత, ఏవో మల్లికార్జున, వివిధ విభాగాల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త విధానాలతో 'ఉపాధి' నిర్వీర్యం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

కూలీలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఉపాధి హామీ చట్టం పీక నొక్కి నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాలను తీసుకొచ్చిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ ఆరోపించారు. శనివారం మండల పరిధిలోని రాచేపల్లి గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలన్నారు. అలాగే పనిముట్లు ఇవ్వాలన్నారు. గత మూడేళ్లుగా మోదీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు భారీగా తగ్గించిందన్నారు. ఈనేపథ్యంలో ఇటీవల నూతన విధానాలను తీసుకొచ్చి చట్టానికి ఎసరు పెట్టేందుకు పూనుకుందన్నారు. రెండు పూటలా పని చేయాలని, ప్రతి నాలుగు గంటలకు ఒకసారి హాజరు వేయాలని, పనిచేసే చోట ఫేస్ యాప్ ద్వారా హాజరు తీసుకోవాలని, ఆధార్‌కార్డు ద్వారా బ్యాంకుకు ఇకెవైసి లింకు చేసి తద్వారా వేతనాలు చెల్లించాలనే నిబంధనలను రూపొందించడం బాధాకరమన్నారు. పోరాడి సాధించుకున్న ఉపాధి చట్టాన్ని పోరాడి నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈక ఆర్యక్రమంలో నాయకులు మండల కార్యదర్శి సుంకన్న, మండల అధ్యక్షులు రామాంజనేయులు, వెంకటస్వామి, సావిత్రి, ఆదినారాయణ, సూర్యనారాయణ, రామాంజి, సంధ్యారాణి, సుబ్బమ్మ, నిర్మల, సుధారాణి, కృష్ణ, ధనలక్ష్మి, వీరాంజనేయులు, నరసింహుడు, రామచంద్ర, సూరి, వెంకటలక్ష్మి, ధనలక్ష్మి, రాధిక, చామంతి, లక్ష్మీదేవి, రమాదేవి, వరలక్ష్మి, వనజ, పుల్లమ్మ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేద్దాం

మాజీమంత్రి సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి సాకే శైలజానాథ్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన అనంతపురంలో నిర్వహించనున్న భారీ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని మాజీమంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీకి నియోజకవర్గం వ్యాప్తంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తులను అమ్మడానికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రం నుంచి 4,55,000కు పైగా సంతకాలను రాష్ట్ర వైసిపి కార్యాలయానికి తరలిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా సంతకాలను ఈనెల 18వ తేదీన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గవర్నర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు పూల నారాయణస్వామి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరకూటి కాటమయ్య, వైసిపి మండల ఎస్సీ మండల అధ్యక్షులు మారుతి, బుక్కరాయసముద్రం సర్పంచు పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

ప్రజాశక్తి-గుత్తి

గుత్తిలో కేసులను విచారిస్తున్న జడ్జి

న్యాయస్థానాల ఆవరణలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి బి.సాదుబాబు, సీనియర్ సివిల్ జడ్జి ఎం.విశ్వనాథ ఆచారి, జూనియర్ సివిల్ జడ్జి బి.శ్వేత 750 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మహమ్మద్ రసూల్, ఎన్.ఓబులేసు, పి.శివకుమార్ ఆచారి, కె.శ్రీనివాసులు, విసి.గంగాధరకుమార్, జాకీర్‌హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాయదుర్గంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలతో 950 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రమ్య తెలిపారు. వీటిలో ఫస్ట్ క్లాస్ కోర్టుకు సంబంధించి 186 కేసులు, సెకండ్ క్లాస్ కోర్టు కేసులు 764 పరిష్కరించినట్లు తెలిపారు. ఫస్ట్ క్లాస్ కోర్టుకు సంబంధించి సెటిల్మెంట్ రూ.15 లక్షలు, జరిమానా రూ.8,57,380, సెకండ్ క్లాస్ కోర్టు కేసులో రూ.5,26,500 జరిమానా విధించగా, రూ.5,30,275 సీజ్ చేసినట్లు తెలిపారు.

పార్టీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

రాష్ట్ర పబ్లిక్ సిటీ వింగ్ సెక్రటరీగా జి.లింగప్ప

ప్రజాశక్తి-కుందుర్పి

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని ఇటీవల నూతనంగా నియమితులైన రాష్ట్ర పబ్లిక్ సిటీ వింగ్ సెక్రటరీ తెనగల్లు జి.లింగప్ప అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పబ్లిక్ సిటీ వింగ్ సెక్రటరీగా నియమించినందుకు అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకట రామిరెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని నమ్మి పని చేసినందుకు న్యాయం జరిగిందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

'అనేక వైపుల' నవల పుస్తకంపై సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

'అనేక వైపుల' నవలపై సమీక్షిస్తున్న వక్తలు

'అనేక వైపుల నవల' పుస్తకంపై శనివారం నగరంలోని పెన్షనర్స్ భవన్‌లో అనంత హక్కుల పోరాట సంఘం సోమర రాహుల్ ఆధ్వర్యంలో సమీక్ష సమాలోచన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త చెన్న రామ్మూర్తి విశ్లేషిస్తూ రాయలసీమ జీవితానికి సమగ్రంగా చిత్రించిన నవల అన్నారు. రాయలసీమలో సమకాలిన స్థితిగతులకు అద్దం పట్టేలా ఉద్యమ పరిస్థితులపై నవల చర్చిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, విరసం సీనియర్ రచయిత నాగేశ్వరాచారి, ఓపిడిఆర్ అడ్వకేట్ ప్రకాష్, రాయలసీమ విద్యార్థుల వేదిక బాధ్యులు వెంకటేష్, రాయలసీమ సాంస్కృతిక వేదిక లక్ష్మీ, పిడిఎస్‌యు వీరేంద్ర, పిఎస్ఎఫ్ అబ్దుల్ ఆలం, రైతు సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు కాంచీపురం పిఎస్ఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

పిఎస్ఆర్ షాపింగ్ మాల్, (ఇన్‌సెట్‌లో) అధినేత సోమిరెడ్డి

నగరంలోని పాత డిఇఒ కార్యాలయం లైన్‌లో ఆదివారం పిఎస్ఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించనున్నట్లు అధినేత ముక్తాపురం సరస్వతి సోమిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ట్రెడ్‌కు అనుగుణంగా అద్భుతమైన, ఆనందకరమైన ఆశ్చర్య పరిచే సరికొత్త డిజైన్‌లతో కాంచీపురం పిఎస్ఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, జెంట్స్, కిడ్స్‌వేర్ వంటి వాటికి అధునాతన సౌకర్యాలతో ప్రత్యేక ఫ్లోర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్న పిల్లలు నుంచి పెద్దల వరకు అన్నిరకాల నాణ్యమైన వస్త్రాలను అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశంతోనే పిఎస్ఆర్ షాపింగ్ మాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టుబడిన టిప్పర్‌తో మైనింగ్ అధికారులు

ఇసుక టిప్పర్ సీజ్

ప్రజాశక్తి-శింగనమల

కడప జిల్లా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ని శింగనమల క్రాస్ సమీపంలో పట్టుకుని సీజ్ చేసినట్లు మైనింగ్ అధికారి ఆదినారాయణ, ఇన్స్‌పెక్టర్ సుప్రజ తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శింగనమల పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

బెలుగుప్పలో డివిజనల్ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-బెలుగుప్ప

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

మండల పరిధిలోని ఎర్రగుడి క్రీడ మైదానంలో శనివారం కళ్యాణదుర్గం డివిజనల్ పురుషుల క్రికెట్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీల్లో రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డిఇఇ పాటిల్ మల్లారెడ్డి మాట్లాడుతూ క్రీడలు నైపుణ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. అదేవిధంగా ప్రతిఒక్కరూ గెలుపోటములను సమానంగా స్వీకరించి ముదుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆయా క్రీడాకారులకు శ్రీనివాస విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీనివాసులు స్నాక్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఆవులెన్న సర్పంచు రామ్మోహన్ చౌదరి, ఎర్రిస్వామి, ప్రధానోపాధ్యాయులు శంకరన్న, ఎంఇఒ వేణుగోపాల్, పీడీలు గోపాల్‌రెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సైబర్ నేరాలపై అవగాహన

అనంతపురం : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు...ఈరోజు బెళుగుప్ప ఎస్ఐ శివ, శక్తి బృందం కలిసి మండల పరిధిలోని యలగలవంక, రామసాగరం గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ ఉపయోగాలు, పనితీరు మరియు మహిళలపై జరుగుతున్న నేరాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణ, సైబర్ నేరాలపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఏవైనా సమస్యలు లేదా అనుమానాస్పద ఘటనలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

హత్యకేసు నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-గుంతకల్లు

నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న సిఐ

స్థానిక పాత గుంతకల్లు అంకాలమ్మ గుడి వీధిలో గత శుక్రవారం జరిగిన కురుబ చంద్ర అలియాస్ చంద్రశేఖర్ (30) హత్య కేసు నిందితుడు కురుబ శివకుమార్‌ను శనివారం అరెస్టు చేసినట్లు 1వ పట్టణ సిఐ మనోహర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నంచర్ల గ్రామానికి చెందిన శివకుమార్ రెండేళ్ల క్రితం పుష్పావతి, అతని తండ్రి చిన్న రంగన్నతో కలిసి అంకాలమ్మ గుడి వీధులోని ఓ అద్దె ఇంట్లో కాపురం ఉంటున్నారు. టైలర్ పని కూలీ పనులు చేసుకుంటూ కుటుంబ పోషణ సాగిస్తున్నాడు. అతని ఇంటి పక్కన అద్దె ఇంట్లో అవివాహితుడైన కురుబ శివకుమార్ తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అయితే వ్యక్తిగత కక్షలతో ఇరు కుటుంబాల మధ్య వాగ్వివాదాలు చోటు చేసుకునేవి. దీంతో కక్ష పెంచుకున్న కురుబ చంద్రశేఖర్ చిన్న విషయాలకు తరచూ శివకుమార్‌తో గొడవ పడేవాడు. ఈనేపథ్యంలోనే శుక్రవారం ఉదయం పబ్లిక్ కొళాయి వద్ద తాగునీరు పట్టుకునే విషయంలో చంద్రశేఖర్‌తో గొడవపడిన శివకుమార్ ఇంట్లోకి వెళ్లి వేట కొడవలితో చంద్రశేఖర్ మెడపై బలంగా నరికడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై భార్య పుష్పావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈనేపథ్యంలో శివకుమార్‌ను స్థానిక హనుమాన్ రైల్వేస్టేషన్ వద్ద అరెస్టు చేసి, హత్యకు ఉపయోగించిన వేటకొడలిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు మనోహర్ తెలిపారు. నిందితున్ని పట్టుకోవడంలో టూటౌన్ ఇన్‌ఛార్జి ఎస్సై కొండయ్య, సిబ్బంది ప్రతిభ కనబరిచినట్లు సిఐ తెలిపారు.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.P.No.4/2020
Between:
పి.షక్షవలి ...అర్జీదారుడు/క్రిడిటార్
And
1) డి.ఎన్.పర్వీన్
2)డి.మారుతీ రంగా
3)పి.లక్ష్మీదేవి ...రెస్పాండెంట్స్
To,
R3) పతకమూరి లక్ష్మీదేవి W/o P. వెంకటేశ్వర నాయుడు R/o D.No: 3-995-6-1-2A, టైలర్స్ కాలనీ, తాడిపత్రి టౌన్, అనంతపురము జిల్లా.
3వ రెస్పాండెంట్స్‌కు నోటీసులు
పై అర్జీలో అర్జీదారుడైన మీ పైన ఇన్సల్వెంట్ పిటీషన్ ను పై కోర్టులో దాఖలు చేసియున్నారు. సదరు అర్జిని కోర్టు వారు మీ హాజరు నిమిత్తము 20-12-2025వ తేదీన వాయిదా వేసి వున్నారు. కావున ఆ దినము మీరు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు ఎదుట మీరు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును, లేని యెడల మీ పరోక్షములో కోర్టు వారు తీర్మనము చేయుదురు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
సి.రమేష్‌నాథ రెడ్డి,& వై.హనీఫ్ బాష,
అడ్వకేట్లు తాడిపత్రి &
జెడ్.సతీష్, అడ్వకేట్, గుత్తి

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిజెఎఫ్) కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, గౌరవాధ్యక్షులు రవిచంద్ర అన్నారు. శనివారం రాయదుర్గంలోని సమైక్యాంధ్ర భవన్‌లో ఎపిజెఎఫ్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఓబులేసు, ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్, గౌరవాధ్యక్షులుగా వన్నప్ప, ఉపాధ్యక్షులుగా ఆవుల మనోహర్, సవరప్ప, కార్యదర్శులుగా హేమచంద్రారెడ్డి, గోపాల్, కోశాధికారిగా రమేష్, ప్రచార కార్యదర్శులుగా నాగభూషణం, ఫణికుమార్, కార్యవర్గ సభ్యులుగా హనుమంతురాయుడు, పెన్నప్ప, బాషా, మధు, అబ్బాస్, మహమ్మద్, సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సాయివిజ్ఞాన్ పాఠశాలకు అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలని 3వ రోడ్డులోని సాయివిజ్ఞాన్ పాఠశాలకు స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డు వచ్చింది. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్ నగరంలోని హైటెక్స్‌లో జరిగిన ఇటి టెక్ ఎక్స్ 6వ ఎడిషన్ అవార్డుల బహుమతి ప్రదాన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కరుణాకర్‌బాబు అవార్డును అందుకున్నారు. అవార్డు రావడంపై పాఠశాల యాజమాన్యం ఎంపి.శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మృతురాలికి నివాళి

నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

శింగనమల : అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని బండమీదపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు శెట్టిపల్లి నరసింహారెడ్డి తల్లి రామలక్ష్మి మృతదేహానికి సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు బొమ్మన శ్రీరామిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నరసింహారెడ్డిని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో నియోజకవర్గ మాజీ సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు. శోదనపల్లి చౌరెడ్డి, బండమీదపల్లి నారాయణరెడ్డి, పోతురాజుకాలువ నాగప్ప, ఆదిరెడ్డి, తదితరులు ఉన్నారు.